www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం 17.01.2025



## ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

### పసుపు బోర్డు ఏర్పాటుపై బీజేఎల్పీ నేత ఏలేటి హర్షం

కలంజ్యోతి, నిర్మల్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంగా కేంద్రీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయటం పట్ల బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని కొనియాడారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. బోర్డు ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, రైతులు ఇకపై ఈ బోర్డు ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోర్డు ఏర్పాటులో రైతుల కృషితో పాటు ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, తక్కల రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, మండల అధ్యక్షులు మార గంగా రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో బీదర్ ఏటీఎం దొంగలు హల్‌చల్

- దొంగల ముఠా కోసం హైదరాబాద్ వచ్చిన బీదర్ పోలీసులు
- అఫ్జల్‌గంజ్‌లో పోలీసులను చూసి కాల్పులు జరిపిన దొంగలు
- దొంగలను వెంబడించి ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



2లో



కలంజ్యోతి, హైదరాబాద్ : హైదరాబాద్ లో బీదర్ దొంగల ముఠా కాల్పులకు తెగబడింది. కర్ణాటకలోని బీదర్ లో ఏటీఎం వ్యాన్ పై కాల్పులు జరిగి భారీగా డబ్బు చోరీ చేసి పరారైన గ్యాంగ్ హైదరాబాద్ లో ప్రత్యక్షమైంది. బీదర్ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు హైదరాబాద్ వచ్చారు. అఫ్జల్ గంజ్ లో పోలీసులను చూసిన దొంగల ముఠా...తప్పించుకునేందుకు పోలీసులపై 3 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ట్రావెల్స్ మేనేజర్ గాయాలయ్యాయి. కాల్పుల ఘటనలో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. కాల్పుల ఘటనపై ఈస్ట్ జోన్ డీసీపీ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కాల్పుల అనంతరం దుండగులు రాయ్ పూర్ పారిపోతున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక, హైదరాబాద్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## పదవి ఇవ్వకుంటే ధర్నాచేస్తా

- కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు
- బీసీ మహిళగా అన్ని అర్హతలు ఉన్నాయి
- రేవంత్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

2లో



## జాతర ముసుగులో జూదం

- దుకాణాల పేరిట టెంట్లు
- ఛేధించిన పోలీసులు

3లో

## హత్య చేసి.. పూడ్చి పెట్టి!

- భార్యను హత్య చేసిన భర్త, అత్తమామ, ఆడపడుచు
- బొందపెట్టిన చోట పిండి వంటలు
- మహబూబాబాద్ జిల్లాలో ఘోర ఘటన
- గోతిపైనే పిండి వంటలు చేసి పైశాచికత్వ ప్రదర్శన

2లో





# హత్య చేసి.. పూడ్చి పెట్టి!

**కలంజ్యోతి, మహబూబాబాద్ :**

మహబూబాబాద్ లో దారుణం జరిగింది. భార్యను... భర్త, అత్తమామ, ఆడపడుచూ.. హత్య చేసి ఇంటి ఆవరణలో పూడ్చి పెట్టారు. అంతేగాదు శవాన్ని పూడ్చిన బొంద పైనే కట్టెల పొయ్యి పెట్టి పిండి వంటలు చేసి పైశాచికాన్ని ప్రదర్శించారు. ఈ దారుణ ఘటన మహబూబాబాద్ లోని సిగ్నల్ కాలనీలో జరిగిన ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిగ్నల్ తండాలోని భూపతి అంజయ్య ఇంటిలో కొన్ని నెలలుగా కాటి గోపి అతడి భార్య నాగమణి, తల్లిదండ్రులు లక్ష్మి, రాములు, ఆడపడుచు దుర్గ, బావ మహేందర్ తో కలిసి ఉంటున్నాడు. గోపినాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులతో పాటు యాచక వృత్తిలో ఉన్నారు. నాగమణిని కొన్ని నెలలుగా భర్త గోపి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే భర్త గోపి తల్లిదండ్రులు, ఆడపడుచు, బావతో కలిసి భార్యను ఈ నెల 13న హత్య చేసినట్లుగా తెలుస్తున్నది. హత్య అనంతరం ఇంటి ఆవరణలోనే నాగమణి మృతదేహాన్ని బొంద తీసి అందులో కప్పేశారు. ఆ రాత్రే ఇంటి తాళం వేసి కుటుంబ సభ్యులంతా పరారయ్యారు. ఈ నెల 13న ఇంటి నుంచి అరుపులు కేకలు వినిపించడంతో స్థానికులు ఇంటి యజమాని భూపతి అంజయ్యకు ఫిర్యాదు చేశారు. గురువారం అంజయ్య ఇంటి వద్దకు చేరుకుని పరిశీలిస్తుండగా గోతి తీసిన ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కానిస్టేబుళ్లు, క్లూస్ టీంతో కలిసి పరిశీలించారు. నాగమణిని హత్య చేసి ఇంటి పక్కనే పూడ్చి వేసి.. బొంద పెట్టిన స్థలంలోనే పొయ్యి ఏర్పాటు చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నాగమణి హత్యకు కారణమేంటి? ఎన్ని రోజుల క్రితం హత్య జరిగిందనే అంశాలపై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

## హైదరాబాద్ లో బీదర్ ఏటీఎం

# దొంగలు హల్ చల్

**పోలీసులపై కాల్పులు..**

స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు... గురువారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరు వ్యక్తులు అఫ్జల్ గంజ్ లోని రోషన్ ట్రావెల్స్ లో రాయపూర్‌కు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారు. వీరిద్దరూ సాయంత్రం ఏడు గంటలకు ట్రావెల్స్ ఆఫీసుకు వచ్చారు. వీరిని మినీ బస్సులు ఆగే పాయింట్ వద్దకు తీసుకెళ్లడానికి ట్రావెల్స్ సిబ్బంది సిద్ధమయ్యారు. ఈ సమయంలో దుండగుల వద్ద ఉన్న బ్యాగ్ ను ట్రావెల్స్ సిబ్బంది చెక్ చేయడానికి ప్రయత్నించారు. అయితే వాళ్లు డబ్బులు తీసి ట్రావెల్స్ సిబ్బందికి ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అప్పటికే మినీ బస్సులో ఉన్న కర్ణాటక పోలీసులు దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో దొంగలు తమ బ్యాగులో నుంచి తుపాకీ తీసి పోలీసులపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌కు బుల్లెట్ గాయం అయ్యింది. మరో వ్యక్తికి గాయమైనట్లు తెలుస్తోంది.

**నిందితుల కోసం**

**నాలుగు బృందాలు రంగంలోకి**

బీదర్ ఏటీఎం దొంగల కోసం హైదరాబాద్‌లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ మొత్తం అలర్ట్ ప్రకటించామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలాస్వామి తెలిపారు. ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపి దుండగులు పరారయ్యాయని తెలిపారు. నిందితుల కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్న డీసీపీ.... డబ్బుల కట్టలతో నిందితులు పారిపోయారని చెప్పారు. నిందితుల కోసం నాలుగు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. చోరీ ఘటనలో మొత్తం ముగ్గురు నిందితులు కాగా, ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతావారిని పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు.







**ఏటీఎం వ్యాన్ పై కాల్పులు ఇద్దరు మృతి**

కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీ దొంగలు పట్టపగలే రెచ్చిపోయారు. బీదర్ లోని శివాజీ చౌక్‌లోని ఓ ఏటీఎంలో డబ్బు పెట్టేందుకు వచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపారు ఇద్దరు దొంగలు. ఈ ఘటనలో ఏటీఎం వ్యాన్ సిబ్బంది ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఇద్దరు దొంగలు ఏటీఎం డబ్బుతో ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పారిపోయారు. ఈ ముఠా హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లో ఉన్నట్టు తెలుసుకున్న బీదర్ పోలీసులు వారిని పట్టుకునేందుకు హైదరాబాద్ వచ్చారు. పోలీసులను గమనించిన నిందితులు మరోసారి కాల్పులకు తెగబడ్డారు. బీదర్ లోని ఎస్బీఐ బ్రాంచ్ ముందు ఈ సంఘటన జరిగింది. దొంగల ముఠా రూ.93 లక్షల నగదుతో పారిపోయారు. ఏటీఎంలో డబ్బు పెట్టే వాహనాన్ని ముందు నుంచీ అనుసరించిన దొంగలు, బ్యాంకు వద్ద దాడి చేశారు. వాహనంలోని గార్డులలో ఒకరైన గిరి వెంకటేష్ దుండగుల కాల్పుల్లో అక్కడికక్కడే మరణించగా, మరొక గార్డు శివకుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. శివకుమార్‌ను ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో అతడూ మరణించాడు. కాల్పులు జరపడానికి ముందు దొంగలు ఏటీఎం వ్యాను గార్డులపై కారం పొడి చల్లారు. బీదర్ ఎస్పీ ప్రదీప్ గుంటి ఈ కేసును పర్యవేక్షిస్తున్నారు.

# పదవి ఇవ్వకుంటే ధర్నా చేస్తా

**కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు**

## సునీతారావు

**కలంజ్యోతి, హైదరాబాద్:**

తానకు నామినేటెడ్ పదవి ఇవ్వకపోతే ఊరుకోను అని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఒక బీసీ మహిళగా, ముదిరాజ్ బిడ్డగా నామినేటెడ్ పదవికి అన్ని రకాల అర్హతలు తనకు ఉన్నాయన్నారు. నన్ను ఎమ్మెల్సీగా చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నాకు నామినేటెడ్ పదవి ఇవ్వకుంటే గాంధీ భవన్ మెట్లపై ధర్నా చేసి పీసీసీ చీఫ్ ను అడ్డుకుంటానని హెచ్చరించారు. గురువారం గాంధీభవన్ లో మాట్లాడిన ఆమె పార్టీ కోసం తాను ఎంతో శ్రమిస్తున్నానని మహిళా కాంగ్రెస్ పైన 150కి పైగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి పోటీ చేసిన సునీతా రావు ఓటమి పాలయ్యారు. తన పదవి విషయంలో గత కొంత కాలంగా ఆమె అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో తనకు గౌరవం దక్కకపోవడంపై గతంలో ఆమె గాంధీభవన్ వేదికగా కంటతడి పెట్టుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీకి అధిష్ఠానం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో తాజాగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.






**మలిదశ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు**

# చెట్టబోయిన సారమ్మ మృతి



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మలిదశ తెలంగాణ సాయుధ కమ్యూనిస్టు పోరాట యోధురాలు, వరంగల్ జిల్లా జల్లి గ్రామానికి చెందిన చెట్టబోయిన సారమ్మ గురువారం ఉదయం 4 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆమె పెత్తందారి వ్యవస్థకు, దొరల పాలనకు వ్యతిరేకంగా తన భర్త అబ్బయ్య సహాయంతో ఎన్నో పోరాటాలు చేశారు. ఎందరో మహిళలకు స్ఫూర్తిని చాటారు. దోపిడీ వర్గాలు నియంతృత్వంగా నిరుపేదల మీద, రైతు కూలీల మీద పెత్తనం చెలాయిస్తుంటే దానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో పోరాటాలు చేశారు. మలిదశ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఎంసీపీఐ పార్టీలో క్రియాశీలకంగా తన భర్త వ్యవహరిస్తుంటే గ్రామస్థాయి రాజకీయాల్లో తనకు వెన్నుదండగా నిలిచారు. బరిసె అందుకొని రంగంలో దిగారు. ఎన్నో పోరాటాలను ముందుండి నడిపించారు. సారమ్మ మృతికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు తెలిపారు.

# జాతర ముసుగులో జూదం





**కలంజ్యోతి, నిర్మల్ :**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బంద్రేవు తండాలో జాతర ముసుగులో పేకాట, కేసినో నిర్వహణ కు రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని గోదావరి జిల్లాలను తలపించేలా సెట్టింగులు వేసి ఈ వ్యవహారాన్ని నడిపించేందుకు యత్నిస్తున్న నిర్వాహకులు పరారయ్యారు. సారంగాపూర్ మండలం బంద్రేవుతాండలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు లో ఉండటంతో ఈ వ్యవహారంలో పాలు పంచుకునేందుకు ఇరు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పేకాట రాయుళ్లు వచ్చారు. ఐతే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పేట్రేగిపోయిన పేకాటరాయుళ్లను అరికట్టేందుకు ప్రత్యేకంగా జిల్లాలో పెట్రోలింగ్ వ్యవస్థను నిఘాను పటిష్టపరిచారు. ఇందులో భాగంగా మూడు బృందాలు జూదం ఆడే ప్రదేశాలను కనిపెట్టే పనిలో ఉన్నారు. అదే సమయంలో సారంగాపూర్ మండలం బండ రేవు తాండ లో జరుగుతున్న నానోజీ మహారాజ్ జాతరలో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారన్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా నేతృత్వంలో దాడులు చేశారు. జాతరకు వంద మీటర్ల దూరంలో ఎవరికి అనుమానం రాకుండా ఆట బొమ్మలు వివిధ సామాన్లు అమ్మే దుకాణాల మాదిరిగా టెంట్లు వేసి ఆడుతున్నారు. పోలీసులు చాకచక్యంగా వీటిని గుర్తించి దాడులు చేశారు. దీంతో వారు పలాయనం చిత్తగించారు. ఒకవేళ పోలీసుల ప్రవేశం జరగకపోతే కోట్ల రూపాయల జూదం జరిగేదని సమాచారం. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో పేకాట ఆడతారని సమాచారం. కోట్లలో రూపాయలు చేతులు మారుతాయని తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి జూదం అరికట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్న పేకాట, జూదాన్ని ఆడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భక్తి భావంతో జాతరను జరుపుకోవాలే తప్ప జూదంతో కాదని సూచించారు. పండగల పేరిట జూదమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.



## నాను మహారాజ్ జాతరలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

**కలంజ్యోతి, నిర్మల్ :**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బంద్రేవు తాండలో నిర్వహిస్తున్న నాను మహారాజ్ జాతరకు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ శ్రీహరి రావుకు ఘనస్వాగతం పలికారు. జాతర లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొనున్న ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు బహుమతిగా అందించారు.ఈ కారక్రమం లో సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాదీ, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, మాజీ జడ్పిటిసి పతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, అడెల్లి ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**కలంజ్యోతి, మల్యాల :**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సైకో మాదిరిగా వ్యవహరిస్తూ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పట్ల వ్యవహరించిన తీరును ఖండిస్తూ మల్యాల మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ చౌరస్తా వద్ద కౌశిక్ రెడ్డి బాస్ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శనిగారపు తిరుపతి, జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్, సంత ప్రకాష్ రెడ్డి, కంచర్ల లక్ష్మణ చారి, ఆగంతపు వంశీ, వీరబత్తిని ప్రతాప్, గుర్రం వెంకన్న, తాళ్ళ హరినాథ్, దూడం రామాంజనేయులు, కటకం వినయ్, అరుణ, శ్రీనివాస్, మోహన్, శ్రీకాంత్, రాజిరెడ్డి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డికి ఘన నివాళి

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా సారంగపూర్ లో మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పార్లమెంట్ విలువలను కాపాడారన్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాదీ, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి ,మాజీ జడ్పిటిసి పతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## డాక్టర్ అవార్డు గ్రహీత శివరామకృష్ణకు సన్మానం

### అభినందించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్ :**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన కోటగల్ల శివరామకృష్ణ ముషీరాబాద్ లోని సిటీ కల్చరల్ ఆడిటోరియం లో ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ శివరామకృష్ణ అణగారిన వర్గాల కోసం చేసిన సేవలు, ఉద్యమ పోరాట ఫలితమే ఈ డాక్టరేట్ అవార్డు అని ప్రశంసించారు. శివ రామకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు డాక్టర్ దక్కినందుకు చాలా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హత్నూర ఎంపీపీ వావిల్ల నర్సింలు, అంబటి అర్జున్ , ముక్కిడి రాములు, ఎంపీటీసీ అగమయ్య సర్పంచ్ లక్ష్మీనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను

# గుర్తించండి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి అమలు చేయనున్న వివిధ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామ, వార్డు సభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో కలిసి ఆమె వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల అందేలా జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఆయా పథకాలకు సంబంధించి అర్హుల ఎంపిక 19లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులను గుర్తించాలన్నారు. నూతన రేషన్ కార్డుల జారీకి కుటుంబ ఆదాయం, భూములు వంటి విషయాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వివిధ పథకాలకు అధికారులు గుర్తించిన లబ్దిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సర్వే పూర్తికాని అర్హులందరూ ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయాల్లో తమ వివరాలు తెలియజేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 6305646600 ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా ఆర్డీఓ లు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డిలు, జడ్పీ సిఈఓ గోవింద్, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఆర్డీఓ విజయలక్ష్మి, వ్యవసాయాధికారి అంజిప్రసాద్, డిఎస్ఓ కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో మరో చరిత్ర.. డాకింగ్ సక్సెస్

## విజయవంతంగా భూకక్ష్యలోకి ఉపగ్రహాలు



**శ్రీహరికోట :**

ఇస్రో డాకింగ్ ప్రక్రియను విజయవంతం చేసి నూతన చరిత్ర సృష్టించింది. స్పాడెక్స్ రెండు ఉపగ్రహాలను విజయవంతంగా భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు గురువారం ఇస్రో ప్రకటించింది. దాంతో ఇస్రో అమెరికా, రష్యా, చైనా తరువాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఇస్రో 2024 డిసెంబర్ 30 న రాత్రి 10 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా పీఎస్ఎల్‌వీసీ60 రాకెట్‌తో భూమికి 470 కిలోమీటర్ల ఎత్తులో రెండు అంతరిక్ష నౌకలను మోహరించింది. రెండు వ్యోమ నౌకలను జనవరి 7న ఈ మిషన్‌లో అనుసంధానం చేయాల్సి ఉంది. కానీ అది వాయిదా పడింది. ఆ తర్వాత జనవరి 9న కూడా సాంకేతిక సమస్యల కారణంగా డాకింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. జనవరి 12న అంతరిక్ష నౌకలను 3 మీటర్లకు దగ్గరగా తీసుకువచ్చిన తర్వాత, వాటిని తిరిగి సురక్షితమైన దూరానికి తీసుకెళ్లారు. గురువారం ఉదయం నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాలను ఇస్రో ప్రవేశపెట్టింది.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండలం కేంద్రానికి చెందిన మాజీ వీఆర్ఓ చిరుతం సంపత్ కుమారుడు సాయిరాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా పదోతరగతి క్లాస్ మెంట్స్ 1999-2000 బ్యాచ్ కి చెందిన మిత్రుడి కుటుంబానికి రూ.20,500 ఆర్థిక సాయంగా అందజేశారు. సాయిరాం మృతి కుటుంబానికి తీరని లోటు అన్నారు. మిత్రుడి కుటుంబానికి భరోసాగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తాళ్ల సునీల్, చెరుపెల్లి రాజు, సదిరం రాజు, వీరభద్రయ్య, ఎడ్ల కుమారస్వామి, రాజేందర్, సురేందర్ రెడ్డి, సంతోష్, మాధవి, రమ, రాజేష్, ప్రశాంత్, రజిత, మహేందర్, నయీమ్ పాషా, కరుణాకర్, నిర్మల, కుమార్, రాజు, విజయ, రవీందర్, తాజుద్దీన్, శంకర్, సరిత, గీత, అనురాధ, సుమలత, ధర్మేందర్ పాల్గొన్నారు.

# నీ అవినీతిని తట్టుకోలేకనే ప్రజలు ఒడగొట్టారు

## మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

**కలంజ్యోతి, మల్యాల :**



నీ అవినీతి, అక్రమాలను తట్టుకోలేకనే నియోజకవర్గ ప్రజలు ఒడగొట్టారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను ఉద్దేశించి మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి విమర్శించారు. గురువారం మల్యాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై రవిశంకర్, ఓ యూట్యూబ్ ఛానల్ చేసిన ఇస్తానుసారంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒక స్కూల్ నడుపుకునే నువ్వు ఎమ్మెల్యే పదవిలో ఎంత సంపాదించావో, ఎన్ని కమీషన్లు తిన్నావో ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమను చూసి వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్ లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు దొంగ ఆనంద రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్, తాళ్ళ హరినాథ్, కటకం వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

**కలంజ్యోతి, నర్సాపూర్ :**



చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు చెందిన సంఘటన నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో గురువారం చోటుచేసుకుంది బాధ్యత కుటుంబీకుల హత్నూర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగరాజు 37 బుధవారం రాత్రి గ్రామ శివారులోని దామరంచ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వలవేసి వచ్చాడు గురువారం తెల్లవారు జామున చెరువు వద్దకు వెళ్లి వలలో చేపలు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు స్థానికులు చూసి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు మృతుడి భార్య నర్సమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తామని పోలీసులు తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

# ముగ్గురు హీరోయిన్లు ఈ సినిమాను రిజెక్ట్ చేశారు

విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'సంక్రాతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా  జనవరి 14న థియేటర్లలో ఈ మూవీ రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించి తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. అలాగే కలెక్షన్ల విషయంలోనూ మంచి వసూళ్లు సాధిస్తుంది. కాగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన పాత్ర గురించి చెబుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'నిజానికి ఆ పాత్ర నా దగ్గరికి వచ్చే ముందు ముగ్గురు హీరోయిన్స్ రిజెక్ట్ చేశారు. ఈ విషయాన్ని అనిల్ రావిపూడి ముందే నాతో చెప్పారు. నలుగురి పిల్లల తల్లి పాత్ర కావడంతోనే వాళ్లు రిజెక్ట్ చేసినట్లు చెప్పారు. అది పెద్ద ఇష్యూ అనిపించలేదు. ఎందుకంటే భాగ్యం లాంటి మంచి పాత్ర నాకు దొరకడం నా భాగ్యం. కచ్చితంగా ఈ సినిమా చూస్తే అయ్యో ఇంత మంచి పాత్ర వద్దనుకున్నామే అని వాళ్లు బాధపడతారు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

